క్లుప్తంగా

శుభ్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డిటౌన్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. సోమవారం మండలంలోని పసల్వాదిలో పారిశుద్ధ్య పనులను పరిశీంచారు. ఈసందర్భంగా గ్రామంలో పలు చోట్ల తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం ఈనెల 9 వరకు నిర్వహించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి



బాధితుడితో మాట్లాడుతున్న కాట శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: పట్నం హైవే రెస్టారెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ పోలీసులను కోరారు. ఆదివారం రెస్టారెంట్ వద్ద జరిగిన గొడవలో గాయపడి బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, అతని సోదరుడిని సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొడవ జరుగుతుందని తెలిసి ఆపేందుకొచ్చిన రాజిరెడ్డిని తీవ్రంగా కొట్టడం సరికాదన్నారు.

క్రీడా ప్రాంగణ పునరుద్ధరణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని గొర్రెకల్ గ్రామంలో ఇటీవల ఓ రోడ్డు వేయడం కోసం ఏకంగా పల్లె క్రీడా ప్రాంగణ స్థలాన్ని తవ్వి మట్టిని తరలించారు. ఈ విషయం గత నెల 28న సాక్షి దినపత్రికలో ×చెరుకుంటలా.. క్రీడా ప్రాంగణం×అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి విచారణకు ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ శశిప్రభ, ఏపీఓ షాహెద్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్యతో కలిసి క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. క్రీడా ప్రాంగణాన్ని పురుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి రుద్రారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ నిలిపివేస్తున్నట్లు ఏడీఈ మోహన్ రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రారం, లక్డారం గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలోని ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపీడీఓ సత్తయ్యకు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, సీనియర్ అసిస్టెంట్ గౌసుద్దీన్ పాల్గొన్నారు .

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సంగారెడ్డి టౌన్ : వయనాడ్ వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. వరద బాధితుల కోసం సేకరించిన విరాళాలను సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరాజ్, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే లక్ష్యంగా...

జిల్లావ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, పలువురు వక్తలు పర్యావరణ పరిరక్షణకు కేవలం మొక్కలు నాటడం వల్లే సాధ్యమవుతుందన్నారు. నాటిన తర్వాత వాటిని పరిరక్షించాలన్నారు. వాతావరణ కాలుష్యం వల్లే అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. కాగా, ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పచ్చదనం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

-నెట్‌వర్క్



నారాయణఖేడ్: ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



న్యాల్‌కల్(జహీరాబాబాద్): న్యాల్‌కల్‌లో ..



న్యాల్‌కల్(జహీరాబాబాద్): చినిగెపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



కల్హేర్: ఇందిరానగర్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు



రాయికోడ్: అధికారులతో కలిసి మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారి జగదీశ్వర్



కంది: కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీడీ లలితా కుమారి



వట్‌పల్లి: ర్యాలీలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ



ఝరాసంగం(జహీరాబాద్): ర్యాలీ నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి ఇనేష్, ఎంపీడీఓ సుధాకర్, విద్యార్థులు

పచ్చదనం పెంపు లక్ష్యంగా..

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పచ్చదనం పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం ప్రారంభించిందని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీత

హత్నూర(సంగారెడ్డి): పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే సునీత, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన హత్నూరలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో వారు పాల్గొని మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు.



పటాన్‌చెరు : సాయిరాంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు మొక్కలు నాటారు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నారాయణఖేడ్: పార్టీ రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఖేడ్, కంగ్టి, మనూరు, నాగల్‌గిద్ద, పెద్దశంకరంపేట, నిజాంపేట, కల్హేర్, సిర్గాపూర్ మండలాలకు చెందిన 200 మందికి సీఎంఆర్‌ఎఫ్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, పండరి రెడ్డి, తాహెర్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

ఫోర్‌లేన్ రోడ్డుగా విస్తరించాలి: సీఐటీయూ

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ఇంద్రేశం నుంచి దౌల్తాబాద్ వెళ్లే అర్‌అండ్‌బీ రోడ్డును ఫోర్‌లేన్‌గా విస్తరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంద్రేశం దర్గా వద్ద రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ ప్రాంతంలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. గుంతలు పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పెద్ద వాహనాలతో నిత్యం రద్దీగా మారుతుందన్నారు. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని రోడ్డును విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయకుమార్, సురేష్ కుమార్, రాము, సురేష్, నాగేంద్ర ప్రసాద్, వరప్రసాద్, నాగేశ్వర్, యాదగిరి, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అధ్వానంగా అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని అల్లాదుర్గం–మెటల్‌కుంట ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంగ్వార్, న్యామతాబాద్, హద్నూర్, రుక్మాపూర్, మిర్జాపూర్(ఎన్), తాట్‌పల్లి తదితర గ్రామాల శివారులో రోడ్డుపై తారు లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షం వల్ల గుంతల్లో నీరు నిలిచాయి. ఇది తెలియని వాహనచోదకులు అందుల్లో పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ రహదారి వాహన రాకపోకలతో ఎప్పుడు రద్దీగా ఉంటుందని మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి బాగు చేయాలని కోరుతున్నారు.



హద్నూర్ వద్ద అధ్వానంగా రోడ్డు

ట్రిపుల్ ఐటీకి దిగ్వాల్ విద్యార్థులు

సంగారెడ్డి రురల్: బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం జాకీర్ హుస్సేన్ సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాలలో జిల్లాల్లోనే ప్రథమ స్థానంలో నిలిచి, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ప్రతిభ పురస్కారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్నట్లు చెప్పారు. పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

ఝరాసంగం(జహీరాబాద్): వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి ఇనేష్ సూచించారు. సోమవారం ఝరాసంగంలోని బీసీ వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ సుధాకర్, వార్డెన్ శారద పాల్గొన్నారు.

కేతకీలో శ్రావణ పూజలు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో శ్రావణ మాస పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమృత గుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు.

ఆ భూములకు పాస్‌పుస్తకాలు ఇవ్వకండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఏళ్ల కిత్రం ప్లాట్‌లు చేసి అమ్మేసిన భూములకు రెవెన్యూ అధికారులు పాస్‌పుస్తకాలు ఇవ్వొద్దని కోరుతూ కొల్లూర్ లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు ప్లాట్ ఓనర్స్ మాట్లాడుతూ.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొల్లూర్‌లో సుమారు 143.26 ఎకరాల భూమిలో పలువురు జీపీఏ చేసుకోని 1984లో ప్లాట్‌చేసి విక్రయించారని తెలిపారు. అప్పట్లో సుమారు 1500 మంది ప్లాట్‌లు కొన్నారన్నారు. ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరగడంతో కొంతమంది కన్ను తమ ప్లాట్‌లపై పడిందన్నారు. తాము న్యాయం పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో అధికారులు తమ ప్లాట్‌లకు చెందిన భూములకు పాస్ పుస్తకాలు ఇవ్వొద్దని వారు కోరారు.



తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్

◆ **పదవి లేకుండా ఎట్లా కూర్చోపెడుతారు**

హత్నూర(సంగారెడ్డి): స్వచ్ఛదనం – పచ్చదనంలో పదవులు లేని నాయకులను సభలో స్టేజీపై ఎలా కూర్చోబెట్టారని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత అన్నారు. హత్నూరలో ప్రభుత్వ అధికార కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్న సభలో ఏ పదవి లేని బీఆర్‌ఎస్ నాయకులను ఎలా కూర్చొని పెట్టుకున్నారని ప్రశ్నించారు.

◆ **బసవ బోధనలు మార్గదర్శకం**

జహీరాబాద్ టౌన్: బసవేశ్వరుడి బోధనలు మానవ జాతికి మార్గదర్శకాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, ఎం.శివకుమార్ అన్నారు. పట్టణంలోని బసవ మండపంలో సోమవారం బసవేశ్వరుడికి పూజలు నిర్వహించారు.

◆ **బ్యాంకు వద్ద పడిగాపులు**

హత్నూర(సంగారెడ్డి): బ్యాంకు రుణాల కోసం రైతులు పుస్తకాలను వరుసలో పెట్టి నానా తంటాలు పడుతున్నారు. మండలంలోని వడ్డేపల్లి ఏపీజీవీబీ బ్యాంకు వద్ద రైతులు రుణాల కోసం పాస్ పుస్తకాలతో పాటు కవర్లను లైన్లో పెట్టి సోమవారం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

◆ **విరాళాల సేకరణ**

సదాశివపేట(సంగారెడ్డి): కేరళ రాష్ట్రంలో వాయనాడు ప్రాంతంలో వరదల వల్ల మరణించిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం విరాళాల సేకరించారు.

◆ **గిరిజన దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ**

సంగారెడ్డి : గిరిజన సంక్షేమ సంఘం, విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న అంతర్జాతీయ గిరిజన దినోత్సవ కరపత్రాలను సోమవారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోవర్ధన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **అన్నపూర్ణేశ్వరుడిగా రామలింగేశ్వరుడు**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని టోల్‌గేట్ సమీపంలోని శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో స్వామివారిని పెరుగన్నంతో అన్నపూర్ణేశ్వరుడిగా అలంకరించారు. అదే విధంగా జేపీ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్య నగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో రుద్రాభిషేకంతోపాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు మహేశ్ తెలిపారు.

◆ **ఆలయంలో ప్రత్యేక పూజలు**

రాయికోడ్(అందోల్) : మండల కేంద్రం రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు లక్షబిల్వార్చన చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ శివరుద్రప్ప తెలిపారు. అదేవిధంగా పాండురంగ ఆలయంలో ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా శోభాయాత్ర నిర్వహించి హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టారు.

◆ **మహారుద్ర యాగం, రుద్రాభిషేకం**

నారాయణఖేడ్: శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని ఖేడ్‌లోని పురాతన కాశీనాథ్ ఆలయంలో మహారుద్ర యాగం, రుద్రాభిషేకం కార్యక్రమాలను పురోహితులు మలమంచి గురురాజ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు ప్రత్యేకపూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మునిగాల మాణిక్ ప్రభు దంపతులు యాగం నిర్వహించారు.

◆ **డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా**

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు కోర్టు జైలు, జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. శనివారం, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నాం. పట్టుబడిన వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 20 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా విధించారు. మరో వ్యక్తికి రూ. 2 వేల జరిమానాతోపాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

◆ **పీఆర్‌టీయూ చేరిక**

జహీరాబాద్ టౌన్: టీపీటీఎఫ్ జిల్లా నాయకులు నర్సింగ్ పవార్ సోమవారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘంలో చేరినట్లు మండల అధ్యక్షులు తులసీరాం రాథోడ్ తెలిపారు. మొగుడంపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నర్సింగ్ పవార్ పీఆర్టీయూలో చేరడం వల్ల సంఘం బలపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు పీఆర్‌టీయూ సభ్యత్వం అందచేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు చంద్రురాథోడ్, వరాలు, శ్రీనివాస్‌లు, నర్సయ్య, శ్రీశైలం, చిట్టిబాబు, జైపాల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ**

జహీరాబాద్ టౌన్: కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా సోమవారం విరాళాలను సేకరించారు. తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నాయకులు తెలిపారు. జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే అక్కడి ప్రజలను ఆదుకోవాలని కోరారు. మహిపాల్, సలీమొద్దీన్, బక్కన్న, నరేశ్, నర్సింహులు, ఆనంద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా కామర్స్ డే**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో సోమవారం కామర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. కళాశాల డైరక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో కామర్స్‌కు ఎనలేని అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఫంక్షన్ కామర్స్, బ్యాలెన్స్ షీట్, ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు సంబంధించి అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాంప్రసాద్, నందు గౌడ్, దత్తు, రమేశ్, నవీన తదితరులు పాల్గొన్నారు.

◆ **పెండింగ్ డీఏలు చెల్లించాలి**

సంగారెడ్డి రురల్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం జిల్లా సంఘ భవన్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వై.నర్సింహులు, ప్రధాన కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని తొలగించి ఓపీఎస్ పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, చెల్లించాల్సిన డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంపత్, లియకత్ అలీ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

◆ **బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బ్రాహ్మణుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామరావు దేశ్‌పాండే అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భెల్ టౌన్‌షిప్‌లో సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు.

◆ **అక్రమ నిర్మాణాల కూల్చివేత**

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాల సమీపంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు, వివిధ రకాల షాపులను అధికారులు కూల్చి వేశారు. సోమవారం లింగంపల్లి గురుకుల పాఠశాల సమీపంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ సంజీవరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, డిప్యూటీ తహసీల్దార్(డీటీ) కృపాదానం, బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

◆ **గర్భిణులకు సీమంతాలు**

నారాయణఖేడ్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నారాయణఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఖేడ్ మండలంలోని పలువురు గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. శిశువులకు తల్లిపాల ఆవశ్యకతను గర్భిణులు, తల్లులకు సీడీపీఓ సుజాత సమగ్రంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

◆ **శ్రావణ సోమవారం పూజలు**

మునిపల్లి(అందోల్): శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు ఆయా దేవాలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో గురుమూర్తులకు, అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి, బుదేరాలో శివాలయంలో భ్రమరాంభ మల్లిఖార్జునస్వామి, అభయ ఆంజనేయస్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన**

సంగారెడ్డి టౌన్: షాద్‌నగర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన దళిత మహిళ సునీతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్య తీసుకోవాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ ఎదుట సోమవారం రాస్తారోకో నిర్వహించారు.